## క్లుప్తంగా

### శుద్ధ నీటి సరఫరాకు కృషి చేయాలి

చింతకాని: పల్లెల్లో శుద్ధ నీటి సరఫరాకు కృషి చేయాలని మిషన్ భగీరథ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సహాయకులు, గ్రామ పంచాయతీ కార్మికులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంపీడీఓ రామయ్య, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

### ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం


మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారి మాధవి

సత్తుపల్లిటౌన్: జాతీయ సేవా పథకం ద్వారా విద్యతో పాటు శ్రమదానం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని జేవీఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.మాధవి అన్నారు. కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ పథకంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి బాలకృష్ణ, అధ్యాపకులు పీర్‌సాహెబ్, పద్మారాణి, బాబు, సుభాషిణి , రవికుమార్, మల్లిక, వెంకటేశ్వర్లు, నారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### సనాతన ధర్మబోర్డును ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లి: హిందూదేవాదాయ, ధర్మాదాయ శాఖ చట్టాన్ని రద్దు చేసి దీని స్థానంలో హిందూ ధర్మాచార్యులతో కూడిన ఒక సనాతన ధర్మ బోర్డును ఏర్పాటు చేయాలని సత్తుపల్లి హిందూ భక్త ధార్మికమండలి, ఆధ్యాత్మిక సంస్థల బాధ్యులు కోరారు. శుక్రవారం సత్తుపల్లిలో అన్ని దేవాలయాల పాలకమండలి సభ్యులు, ఆధ్యాత్మిక సంస్థల బాధ్యులు, హిందూభక్త ధార్మిక మండలి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు తహసీల్దార్ యోగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సాంబశివరావు, రాజా, మధు, శివరామప్రసాద్, వెంకటేశ్వరరావు, అప్పారావు, ఆర్.విశ్వేశ్వరరెడ్డి, కృష్ణారావు, దాశరధి, అంకమరాజు, మూర్తి, నారాయణ పాల్గొన్నారు.

### భూమిపూజ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని హనుమాన్‌నగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం పునః నిర్మాణానికి శుక్రవారం ఆలయ కమిటీ బాధ్యులు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కృష్ణారెడ్డి, సత్యం, శ్రీను, హరిప్రసాద్‌రెడ్డి, సాంబశివరావు, సురేష్ పాల్గొన్నారు.

### వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా నాగమణి

కల్లూరురూరల్: ఖమ్మం, కొత్తగూడెం, ములుగు జిల్లాల వీఓఏల సంఘం(ఏఐటీయూసీ అనుబంధం) ఉపాధ్యక్షురాలిగా కల్లూరులోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన వేము నాగమణిని ఎన్నుకోగా.. వెన్నవల్లికి చెందిన షహనాజ్‌ను కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సాంబశివరావు పాల్గొని వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

### ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కారేపల్లి: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య అన్నారు. శుక్రవారం మాణిక్యారంలో నిర్వహించిన శాఖా మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం జమిలీ ఎన్నికలకు సిద్ధమవటం, ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వేయటమేనన్నారు. అంతకుముందు మాణిక్యారం శాఖా-1 కార్యదర్శిగా కరపటి సీతారాములు, శాఖా-2 కార్యదర్శిగా పోతర్ల నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, సత్యనారాయణ, నాగేశ్వరరావు, నరేందర్ పాల్గొన్నారు.

### గుండెపోటుతో వ్యక్తి మృతి

సత్తుపల్లి: కోఆపరేటివ్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి, స్వచ్ఛంద సేవకుడు చంద్రమౌళి(80) సత్తుపల్లిలో గుండెపోటుతో మృతి చెందారు. ఈయన ఉద్యోగ విరమణ అనంతరం సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఎంక్వైరీలో ప్రయాణీకులకు బస్సుల రాకపోకల సమాచారాన్ని చాలా కాలంపాటు స్వచ్ఛందంగా అందించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయలక్ష్మి సంతాపం తెలిపారు.

# పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలి


కల్లూరు: గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాగమయి


బోనకల్: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు

కల్లూరు/బోనకల్: పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే రాగమయి అన్నారు. శుక్రవారం కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం 25మంది గర్భిణులకు సీమంతాలు, 26మంది పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అదే విధంగా బోనకల్ మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో అంగన్‌వాడీ సూపర్వైజర్ రమాదేవి పాల్గొన్నారు. అనంతరం గృహ సందర్శన నిర్వహించారు. పోషణ్ మాస ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓ సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, సీడీపీఓ నిర్మలాదేవి, ఎంఈఓ నివేదిత, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలత, ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్యకాంత్, ఏపీఎం వెంకట్రామారావు, కాంగ్రెస్ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ జీవితం ఆదర్శ ప్రాయం

సత్తుపల్లిటౌన్: అతిచిన్న వయస్సులోనే దేశ స్వాతంత్య్రం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శప్రాయమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లిలోని స్టాట్యూ సెంటర్‌లోని భగత్‌సింగ్‌విగ్రహ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భగత్‌సింగ్ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, చెన్నకేశవరావు, శ్రీనివాస్, లింగారెడ్డి, నర్సింహారెడ్డి, నాగేశ్వరరావు, నాయుడు వెంకటేశ్వరరావు, రామకృష్ణ, యోబు, రంజాన్‌బీ, దూదిపాల రాంబాబు, పింగళి సామేలు, వీరివాడ నాభూషణం, మారుతి బాబురావు పాల్గొన్నారు.

**కార్తికేయ ఈఎన్‌టీ ఆస్పత్రి ప్రారంభం..**

పట్టణంలోని కాకర్లపల్లిరోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్తికేయ ఈఎన్‌టీ ఆస్పత్రిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.హారిక, డాక్టర్ ఎస్‌కె మౌలాలీ, వెంకటేశ్వరరావు, పవన్, సతీష్, కమల్‌పాషా, రామ్మోహన్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మామునూరు గ్రామంలో..**


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరులో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించగా.. ఆయన చిత్రపటానికి డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా కృష్ణ, స్వామి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు వీరాంజనేయులు, నాయకులు కృష్ణ, రసూల్, కుమార్, సామేల్, బాబు, కిషోర్ తదితరులున్నారు.

### కళాశాల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఏన్కూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం వినతిపత్రం అందజేశారు. కళాశాలలో టాయిలెట్స్, తరగతి గదుల ఫ్లోరింగ్ దెబ్బతిందని, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, కళాశాలకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

**పీసీసీ అధ్యక్షుడికి వినతి..**

కొణిజర్ల: మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ.. ఐఎన్‌టీయూసీ అనుబంధ మిషన్ భగీరథ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలారి రాములు శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. పీసీసీ భవన్‌లో ఆయనను కలిసి కార్మికుల సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

### సింగరేణి ఎంపీఓగా రవీంద్రప్రసాద్


రవీంద్రప్రసాద్

కారేపల్లి: సింగరేణి ఎంపీఓగా మల్లెల రవీంద్రప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. చింతకాని మండల ఎంపీఓగా విధులు నిర్వర్తించిన రవీంద్రప్రసాద్ బదిలీపై సింగరేణి వచ్చారు. కాగా.. సింగరేణి ఎంపీఓగా విధులు నిర్వర్తించిన పర్వీన్ కౌసర్ బదిలీపై చింతకాని మండలానికి వెళ్లారు.

### పోస్టల్ బీమా చెక్కు అందజేత

కొణిజర్ల: రోడ్డు ప్రమాద బాధితుడికి మండలంలోని పల్లిపాడు పోస్టల్ అధికారులు శుక్రవారం పోస్టల్‌బీమా చెక్కును అందజేశారు. పల్లిపాడు గ్రామానికి చెందిన వల్లమూడి గోపాలకృష్ణయ్య 2023లో పోస్టల్ బీమా తీసుకున్నాడు. ఈ ఏడాది మే 25న రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేరాడు. వైద్య ఖర్చులు రూ.42,000 బిల్లు చెల్లించగా.. బీమా ఉన్నందున చెక్కును తపాలాశాఖ మధిర సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, పల్లిపాడు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ మినాజుద్దీన్‌లు గోపాల కృష్ణకు అందజేశారు. గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు పోస్టల్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని మల్సూర్‌తండా, రంగంబంజర గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు కుర్నవల్లి సెక్షన్ విద్యుత్ ఏఈ సుందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా

కల్లూరు: కల్లూరు నూతన బస్టాండ్‌లో శనివారం ఉదయం 9 గంటలకు దివ్యాంగులకు 50శాతంతో కూడిన బస్‌పాస్‌లను ఉచితంగా అందించనున్నట్లు సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులందరూ సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకొచ్చి బస్‌పాసులు తీసుకోవాలన్నారు.

### ఎస్సీ వర్గీకరణ చట్టాలను అమలు చేయాలి

తల్లాడ: సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చట్టాలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తల్లాడలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఇస్నేపల్లి అశోక్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశ్వరరావు, సీతారాములు, కిరణ్, వెంకటేశ్వర్లు, శశి, నాగేశ్వరరావు, శ్రీను, వెంకటరత్న, తేజ, నాగరాజు, రవి, సుధాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మైనార్టీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

కొణిజర్ల: ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో మండలంలోని అమ్మపాలెం తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల (ఖమ్మం) విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్-17 కబడ్డీ, ఖోఖోలో ప్రథమ స్థానం, అండర్-14 వాలీబాల్‌లో రెండో స్థానం సాధించారు. అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్ మొదటిస్థానం 100 మీటర్స్, 400 మీటర్స్ రన్నింగ్‌లో తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎల్.జితేష్ సాహిల్, పీడీ రవికుమార్, పీఈటీ హరీష్ అభినందించారు.

**జిల్లాస్థాయి క్రీడా పోటీలకు..**

కొణిజర్ల: మండల, జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సింగరాయపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం కె.లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థులను ఆయనతో పాటు ఉపాధ్యాయులు, పీడీ వెంకటేశ్వర్లు శుక్రవారం అభినందించారు.

**బహుమతులు అందజేత..**

ముదిగొండ: మండలంలోని మాధాపురం జెడ్పీ పాఠశాలలో అండర్-14, అండర్-17 విభాగాల్లో కుసుమంచి జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను హెచ్ఎం వినయ్‌కుమార్ ప్రారంభించగా.. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంఈఓ రమణయ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో జోనల్ క్రీడల కార్యదర్శి శ్రీను, క్రిష్టారావు, రవి, శ్రీనివాసరావు, నాగులమీరా, రామకృష్ణ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

### యూడైస్ సమాచారం తప్పనిసరి..

సత్తుపల్లిరూరల్: పాఠశాలల యూడైస్ సమాచారం తప్పని సరిగా నమోదు చేయాలని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక త్రివేణి పాఠశాలను సందర్శించారు. పాఠశాలల భౌతిక వనరులు, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేయాలన్నారు. విద్యార్థుల్లో వైకల్యం వివరాలను ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు మధుసూదనాచారి, శ్రీలత పాల్గొన్నారు.

### ఎఫ్ఎల్ఎన్ సర్వే పరిశీలన

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు, చిరునోముల గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మూడో తరగతి విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ సర్వేను డైట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించేందుకు డీఈడీ ఛాత్రోపాధ్యాయులచే యాప్ సాయంతో పరీక్షిస్తున్నారు. మూడో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణరాజు, ఎంఈఓ దామాల పుల్లయ్య ఉన్నారు.

### జీఓ 25ను సవరించాలి

బోనకల్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీ చేసిన జీఓ 25ను సవరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బోనకల్ ఎంఈఓ దామాల పుల్ల య్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ మాట్లాడుతూ.. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, ఉన్నత పాఠశాలలో విద్యార్థులను మీడియం వారీగా లెక్కించాలన్నారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ, నాయకులు సద్దాబాబు, పి.గోపాల్ రావు, చిన్న రంగారావు, లవకుశ, సుజాత, పద్మావతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి బాలింత మృతి

**మృతదేహంతో బంధువుల ఆందోళన**

సత్తుపల్లి: వైద్యం వికటించి బాలింత మృతి చెందిన ఘటన సత్తుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాచారానికి చెందిన తమ్మిశెట్టి శ్రావణి (21)కి నెలలు నిండడంతో సత్తుపల్లిలోని చందమామ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు గురువారం రాత్రి వైద్యురాలు ఆపరేషన్ చేయడంతో ఆడపిల్లకు జన్మనిచ్చింది. కానీ ఆపరేషన్ వికటించినట్లు తెలియగా, తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో బాలింతను గురువారం అర్ధరాత్రి ఖమ్మం రెఫర్ చేశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరిన శ్రావణిని ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించగా హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. ఈ మేరకు ఆమె మృతదేహాన్ని తీసుకొచ్చిన బంధువులు శుక్రవారం రాత్రి సత్తుపల్లిలోని చందమామ ఆస్పత్రి వద్ద ఆందోళనకుదిగారు. కాగా, సత్తుపల్లి సీఐ కిరణ్ సిబ్బందితో చేరుకుని పర్యవేక్షించారు. అయితే, ఆస్పత్రి బాధ్యులు, శ్రావణి బంధువుల మధ్య రాజీ కుదుర్చేందుకు కొందరు వైద్యులు, ప్రముఖులు చర్చలు మొదలుపెట్టారు. ఏదిఏమైనా శ్రావణి మృతితో కళ్లు కూడా తెరవని ఆమె బిడ్డను చూసి పలువురు కన్నీటి పర్యంతమవుతున్నారు.

# మహిళలు ఉద్యమానికి సిద్ధం కావాలి


జెండా ఆవిష్కరిస్తున్న బండి పద్మ

ఎర్రుపాలెం: మహిళా హక్కులను కాలరాస్తున్న కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు మహిళలందరూ ఐక్యమై మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మామునూరులో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 4వ మండల మహాసభను ప్రారంభించారు. తొలుత సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి స్వర్గీయ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా సంఘం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజీలేని పోరాటాలు నిర్వహించేది ఐద్వా ఒక్కటేనన్నారు. అనంతరం మండల మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నిక చేశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా గొల్లపూడి లక్ష్మి, చిత్తారు నాగమణి, గౌరవాధ్యక్షురాలిగా కల్పనా దత్తును సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రభావతి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలను సందర్శించిన శాస్త్రవేత్తలు


మధిర: పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు


కల్లూరురూరల్: పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మధిర: మండలంలోని ఇల్లెందులపాడు గ్రామంలో పత్తి, వరి పంటలను గురువారం మండల సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్.విజయచంద్ర, మధిర పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రుక్మిణి, నాగస్వాతి, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. భారీ వర్షాలతో పత్తిలో రసం పీల్చు పురుగులు, గులాబీ రంగు పురుగు ఆశించినట్లు గుర్తించారు. అలాగే పిండి నల్లి కూడా ఉన్నట్లు గమనించారు. రసం పీల్చు పురుగుల నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0. 3 నుంచి 0.4 గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారీ చేయాలన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటర్లు లేదా లాండాసైహాలోత్రిన్ ఒక మీ.మీ లీటర్ నీటి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం వరిలో ఆకుముడత ఆశిస్తున్నట్లు గమనించారు దాని నివారణకు కారటప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాన్ ట్రా నీలి ప్రోలు 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

**బత్తుపల్లిలో..**

కల్లూరురూరల్: మండలంలోని బత్తుపల్లి లిఫ్ట్ ఇరిగేష్ కింద సాగవుతున్న వరి పంటను శుక్రవారం సత్తుపల్లి వ్యవసాయ శాఖ సంచాలకుడు శ్రీనివాసరెడ్డి, కల్లూరు వ్యవసాయ శాఖ అధికారి ఎం.రూప పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటరమణ, లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు రైతులు నరసింహా, రాంబాబు, శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


వేంసూరు మండలంలో..

**యూరియా వాడకం తగ్గించాలి**

వేంసూరు: రైతులు పంటపొలాల్లో అవసరానికి మించి యూరియా వాడుతున్నారని, దీంతో భూసారం తగ్గుతుందని సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకుడు వి.శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పలుగ్రామాల్లో కరివేద పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలాలను పరిశీలించి మాట్లాడుతూ.. వరిలో సుడిదోమ నివారణకు బుప్రోఫేజ్ 320 మి.లీ లేదా పైమెట్రోజీన్ 120 గ్రాములు కానీ, డైనోటిప్యురాన్80 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. వరిలో ఎండు తెగులు నివారణకు అగ్రిమైసిన్ 80, లేదా ప్లాంటా మైసిన్40 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. అనంతరం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ రామ్మోహన్, రైతులు సత్యనారాయణ, ఆశారావు, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. ఖమ్మంలోని శాంతినగర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన తానా ఫౌండేషన్ ఆదరణ కార్యక్రమంలో దాత కాట్రగడ్డ సునీత జ్ఞాపకార్థం 15 సైకిళ్లను అందించారు. పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో తానా ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్, తుమ్మల యుగంధర్, కూరాకుల సైదయ్య, రామకృష్ణ, బండి నాగేశ్వరావు, రాజేశ్వరి, వర్జీనియా పాల్గొన్నారు.

### దివ్యాంగులకు నిత్యావసరాలు..

కారేపల్లి: కారేపల్లిలోని నిరుపేదలైన 15మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లను కారేపల్లి జామే మసీదు మాజీ అధ్యక్షుడు షేక్.గౌసుద్దీన్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ ఖలీలుల్లాఖాన్, భూక్యా చందూనాయక్, సద్దాంహుస్సేన్, ఫరోజ్ (బూది), ముస్తాక్, సుబ్బయ్య, సాయిలు, కృష్ణ పాల్గొన్నారు.

### విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు శుక్రవారం రిటైర్డ్ జేఏల్ వేమూరి సత్యనారాయణ కుమారులు, ప్రవాస భారతీయులు సుధీర్, అజయ్‌లు గతేడాదిలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రేతు సురేష్ రూ.60 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్, బీటెక్ చదువుతున్న కొత్తపల్లి ధనూష్, శ్రావణ్‌కుమార్‌లకు రూ.10 వేలు, పాతపినపాక గ్రామానికి చెందిన కొమ్మురి లయకు రూ.20 వేలతో పాటు పలువురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇంటూరి సూర్యకుమారి, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

**బాధితుడికి ఆర్థిక సాయం..**

ముదిగొండ: మండలంలోని వనంవారికిష్టాపురానికి చెందిన నాగరాజు గత కొద్దిరోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో వైద్యచికిత్స కోసం ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

**పూర్వ విద్యార్థుల ..**

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో చదువుతున్న పెనుగొండ రాజేష్ అనే విద్యార్థి అనారోగ్యంతో బాధపడుతూ.. నిమ్స్‌లో వైద్య చేయించుకుంటుండగా వైద్య ఖర్చుల నిమిత్తం గురుకుల పూర్వ విద్యార్థులు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, జమునారాణి, శివకుమార్ పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య సంఘం బాధ్యుల నిరసన

వైరా: వైరా నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి పేరుగా మార్చటాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆర్యవైశ్య సంఘం బాధ్యులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్, కార్యదర్శి వనమా విశ్వేశ్వరరావు, నాయకులు కృష్ణామూర్తి, సుబ్బారావు, సత్యంబాబు, ప్రసాదరావు, చక్రవర్తి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని, తెలంగాణకోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి అని పలువురు వక్తలు అన్నారు. లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిరూరల్: 15వ బెటాలియన్‌లో లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ చటర్జీ


బోనకల్: బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ పున్నం చందర్


వైరా: కొండా బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


తల్లాడ: బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ చంద్రమౌళి


వైరారూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో..


కొణిజర్ల: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రోజారాణి, సిబ్బంది


పెనుబల్లి: మండల పరిషత్ కార్యాలయంలో..


ముదిగొండ: తహసీల్ కార్యాలయంలో..